ప్రజాశక్తి
శుక్రవారం 7 నవంబరు, 2025
5
శ్రీకాకుళం

వ్యవసాయ శాఖ జెడి బాధ్యతల స్వీకరణ

పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం సిటీ: జిల్లా వ్యవసాయ శాఖ జెడిగా మనోహర్ ప్రసాద్ గురువారం బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా జిల్లా ప్రయోజిత వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయడానికి అవసరమైన సహాయ సహకారాలను పూర్తిగా అందజేస్తామని జెడి చెప్పారు. జిల్లాలో వ్యవసాయ రంగంలో కృషి చేయనున్నట్లు తెలిపారు. రైతులకు వారికోసం ప్రవేశ పెట్టిన ప్రభుత్వ పథకాలు చేరువచేయనున్నట్లు వివరించారు.

సమస్యల వలయంలో వసతిగృహాలు

- బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు
- మైదానాలు లేక అవస్థలు
- పట్టించుకోని ప్రభుత్వాలు

ప్రభుత్వం, సంబంధిత అధికారులు వసతి గృహాల పర్యవేక్షణ గాలికి వదిలేసింది. శిథిల భవనాల్లో ఏ క్షణం పైకప్పు కూలిపోతోందోనని విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఆర్థిక పరిస్థితులు బాగోలేక బాగా చదువుకుని కన్న తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా నిలవాలనే లక్ష్యంతో మారుమూల గ్రామాల నుంచి వస్తున్న పేద విద్యార్థులు వసతిగృహాల్లో వసతులు లేకపోవడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో గడుపుతున్నారు.

ప్రజాశక్తి - మెళియాపుట్టి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు అవసరమైనా వసతిగృహాల విద్యార్థులు వ్యాయామ క్రీడలకు దూరం అవుతున్నారు. పాఠశాల అనంతరం వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులకు కనీస క్రీడా మైదానం సౌకర్యం లేకపోవడంతో గదులకే పరిమితమవుతున్నారు. మండలంలో 11 వసతి గృహాలు ఉన్నాయి. భరణికోట, పెద్దమడి, బందపల్లి, నేల బొంతు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలు, మెళియాపుట్టిలో కెజిబివి ఉంది. అలాగే బాలురుకు సంబంధించి పెద్దమడిలో రెసిడెన్షియల్ బాలురు, పెద్దలక్ష్మీపురంలో గిరిజన బాలురు, చాపరలో ఎస్‌సి వసతిగృహాలు ఉన్నాయి. ఈ వసతిగృహాల్లో మొత్తం 1914 మంది విద్యార్థులు చదువుచుండగా ఇందులో బాలురు 763 మంది, బాలికలు 1151 మంది చదువు సాగిస్తున్నారు. పెద్దలక్ష్మీపురం గిరిజన ఆశ్రమ పాఠశాల పెద్దమడి బాలికలు, బాలురు వసతిగృహాలు మినహాయించి మిగతా వసతిగృహాల్లో ఆట స్థలం కొరత వెంటాడుతుంది. అలాగే కిటికీలు, తలుపులు మరమ్మతులకు గురి కావడంతో గదుల్లో దోమల బెడద వెంటాడుతుంది. విద్యార్థులకు దోమతెరల సౌకర్యం కొరబడింది. భరణికోటలో మరుగుదొడ్లు, మురుగునీరు సమస్య వెంటాడుతుంది. పెద్దలక్ష్మీపురం ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వార్డెన్ నివాస గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. అలాగే ఇక్కడ నిర్మించిన విద్యార్థుల మరుగుదొడ్లు నిర్మించినా బిల్లులు చెల్లించలేకపోవడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దమడి రెసిడెన్షియల్ పాఠశాలకు సంబంధించి ఉపాధ్యాయుల వసతిగృహాలు కొన్నేళ్లుగా మరమ్మతులకు గురై

టెక్కలి రూరల్ : తాగునీటి బోరు వద్ద నిల్వ ఉన్న మురుగునీరు

మూలనపడ్డాయి. విద్యార్థులకు వైద్య సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. పెద్దమడి, భరణికోట, బందపల్లి, నేలబొంతు వసతిగృహ విద్యార్థినులకు వైద్య సేవలకు దూరం అవుతున్నారు. అత్యవసర సమయాల్లో దూరంగా ఉన్న మెళియాపుట్టి, కరజాడ ప్రభుత్వాస్పత్రులకు వ్యయ ప్రయాసాలతో వెళ్లాల్సి వస్తోంది. అలాగే నేలబొంతు వసతిగృహంలో డైనింగ్ హాలు, ఇన్వర్టర్, నెట్, బోరు, స్ట్రీట్ లైట్స్ సమస్య ఉంది. బందపల్లి వసతిగృహానికి ప్రహరీ, జంగిల్ క్లియరెన్స్, రోడ్డు సమస్య వెంటాడుతుంది. అలాగే పెద్దమడి బాలురు వసతిగృహానికి భవనాల చుట్టూ మురుగు నీరు నిల్వ, థిస్ మెంటల్ డార్మెటరీ ఇంటీరియర్స్ ఇంటర్నల్ రోడ్డు రూట్స్ సమస్యలు ఉన్నాయి.

టెక్కలి రూరల్ : డివిజన్ కేంద్రమైన టెక్కలిలో వసతిగృహాల్లో సమస్యలు విద్యార్థులకు వేధిస్తున్నాయి. అయ్యప్ప నగర్‌లోని బాలుర వసతిగృహంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. మురుగు నీటిలో బోరుబావి ఉండడంతో తాగడానికి ఇబ్బందిగా ఉంది. అనారోగ్యం పాలవుతామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే వసతిగృహాలకు రక్షణగోడ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన కాస్మెటిక్ బకాయిలు అందడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

సోంపేట: మండలంలోని వాడపాలెంలో భవనాలు బాగో లేకపోవడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోతున్నారు. మామిడిపల్లి వసతిగృహానికి ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళల్లో విష సర్పాలు, ఇతర జంతువులు గదుల వద్దకు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు భయాందోళనలు వ్యక్తం చేశారు. మండలంలోని రెండు ఎస్‌సి వసతిగృహాలు ఉన్నాయి. బారువలో పిల్లలు 96 మంది, సోంపేటలో పిల్లలు వంద మంది, బిసి వెల్ఫేర్ హాస్టళ్లు నాలుగు, బిసి బాలికల హాస్టల్ ఒకటి, వాడపాలెం పిల్లలు 80 మంది, సోంపేటలో పిల్లలు 150 మంది, బిసి బాలురు హాస్టల్ మామిడిపల్లి పిల్లలు 26 మంది, బిసి బాలురు హాస్టల్ ఎర్రముక్కాం లో

సోంపేట : శిథిలావస్థలో ఉన్న వాడపాలెం వసతిగృహం

13 మంది, గిరిజన ఆశ్రమ పాఠశాల మాల గోవిందపురంలో పిల్లలు 216 ఉన్నారు.

టెక్కలి : ప్రభుత్వ ఆధీనంలో నిర్వహిస్తున్న పలు సంక్షేమ వసతిగృహాలల్లో మరుగుదొడ్ల వినియోగానికి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. టెక్కలి పట్టణంలో గిరిజన సంక్షేమ వసతిగృహాలు మూడు, వెనుకబడిన సంక్షేమ వసతిగృహాలు నాలుగు, ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ వసతిగృహాలు రెండు, మహాత్మాజ్యోతీబాపూలే గురుకుల పాఠశాల, గిరిజన ఆశ్రమ పాఠశాల ఉన్నాయి. వీటిలో సుమారు 15 వందల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒక్కో వసతిగృహాల్లో వంద మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. వీరికి అవసరమైన మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. కాగా, గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో భవనాలు మరామ్మతులకు గురయ్యాయి. భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాకపోవడంతో మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో పాతభవనాల మధ్యనే విద్యార్థులు జీవించాల్సిన పరిస్థితి.

మెళియాపుట్టి : శిథిలావస్థకు చేరుకున్న పెద్దమడి వసతిగృహం

మెళియాపుట్టి : భరణికోట హాస్టల్ వద్ద నిల్వ ఉన్న మురుగునీరు

పెచ్చులూడుతున్న భవనం దూమ్

శిథిలావస్థలో...

రణస్థలం: రణస్థలం మండలంలో ఉన్న బిసి బాలుర హాస్టల్ కొవ్వాడ, బిసి బాలుర కాలేజ్ హాస్టల్ రణస్థలం, (ఎస్‌డబ్ల్యు) బాలుర హాస్టల్ రణస్థలం, బిసి బాలుర హాస్టల్ పాతర్లపల్లి, పైడిభీమవరం, బిసి బాలుర హాస్టల్ రణస్థలం, బిసి బాలికల హాస్టల్ రణస్థలం, ఎస్‌సి బాలికల హాస్టల్ రణస్థలం, బిసి బాలుర హాస్టల్ కె.వి.పేట, బిసి బాలికల హాస్టల్ జీరుపాలెం గ్రామాల్లో వసతి గృహాలున్నాయి. కళాశాలల వసతిగృహాల దుస్థితి అధ్వానంగా ఉంది. మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు బయటకు వెళ్లాల్సిన దుస్థితి కనిపిస్తోంది. అలాగే తాగేందుకు శుద్ధజలం లేక కలుషిత నీరుతాగి అనారోగ్యాల పాలవుతున్నారు. కిటికీలకు దోమతెరలు లేకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. అలాగే ఎన్నో హాస్టళ్లకు ప్రహరీగోడలు లేక పశువులు, కుక్కలు లోపలికి వచ్చేస్తున్నాయి. పలు సమస్యలతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో ఉన్న వసతి గృహాల్లో పైడి భీమవరం, రణస్థలం బిసి వసతి గృహాలు మరీ అధ్వానంగా ఉన్నాయి. ఇక్కడ ఏ క్షణం పైకప్పు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉంది. రణస్థలం బిసి వసతి గృహం మరమ్మతుల నిమిత్తం రూ.10 లక్షలు కేటాయిస్తే, మూడు గదులను మాత్రమే చక్కగా తయారు చేశారు. మిగతా గదులు వదిలేశారు. ఈ భవనాలకు ప్రహరీలు లేవు. అలాగే వంట తయారీ గది, భోజనశాలతో పాటు పలు గదులు పూర్తిగా పెచ్చులూడిపోయి కూలిపోయే స్థితిలో ఉన్నాయి. కొన్నింట్లో కిటికీలకు దోమతెరలు లేకపోవడం, మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సిపిఎం నాయకులకు చూపిస్తున్న విద్యార్థులు

సమస్యలు పరిష్కరించాలి

సంక్షేమ హాస్టళ్ల సమస్యలకు నిలయంగా మారాయి. అనేక హాస్టళ్లలో విద్యార్థులకు సరిపడ మౌలిక సదుపాయాలు లేవు. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలి. హాస్టళ్లలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి. సొంత భవనాలు నిర్మించాలి.

- సిహెచ్.అమ్మన్నాయుడు, సిపిఎం నాయకులు

మరమ్మతులు చేయాలి

హాస్టల్స్ భవనాలు, బాత్ రూమ్ టైల్స్ పగిలి తలుపులు ఊడిపోయాయి. ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు కావడంతో వర్షాకాలంలో కురిసి గోడలు నానిపోయే ప్రమాదం ఉంది. చాలా హాస్టళ్లలో అరకొర సౌకర్యాలే ఉన్నాయి. పలు భవనాలు నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. జిల్లా అధికారులు మరమ్మతులు చేపట్టి కనీస సౌకర్యాలు కలిపించాలి.

- వెలమల రమణ, సిపిఎం రణస్థలం శాఖ కార్యదర్శి

సాగునీటి కాలువల అభివృద్ధికి ప్రణాళికలు

వంశధార ఎస్ఇ జి.రామచంద్రరావు

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

ఓపెన్ హెడ్ కాలువను పరిశీలిస్తున్న వంశధార ఎస్ఇ రామచంద్రరావు

వంశధార సాగునీటి కాలువల ఆధునీకరణతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వంశధార ప్రాజెక్టు ఎస్ఇ జి.రామచంద్రరావు అన్నారు. మండలంలోని యరగాం, పురుషోత్తపురం, బైరి ఓపెన్ హెడ్ ఛానళ్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ హెడ్ ఛానల్ ఆధునీకరణ చేపట్టి రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడానికి ఇప్పటికే ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు. యరగాం, పురుషోత్తపురం, బైరి వంశధార సాగునీటి కాలువలు కొంతకాలంగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో పంట భూములకు నీరందడం లేదని, అభివృద్ధి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ సూచించారని తెలిపారు. ఆధునీకరణ అభివృద్ధి పనుల ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇఇ ఎం.మురళీమోహన్, డిఇ క్రాంతికుమార్, జెఇ శోభనబాబు వంశధార అధికారులు పాల్గొన్నారు.

రూ.700 కోట్లతో ఏం చేశారు?

- ప్రజలకు నీరందించడంలోనూ రాజకీయాలా!
- ఆర్‌డబ్ల్యుఎస్ సమీక్షలో ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి - కవిటి

సమావేశంలో మాట్లాడుతున్న విప్ అశోక్

హిరమండలం నుంచి ఉద్దానం ప్రజలకు ఇంటింటికీ తాగునీటి ప్రాజెక్టు కోసం కేటాయించిన రూ.700 కోట్లతో ఏం చేశారు?, ఎంతమందికి నీరందించారు? ఎంతవరకు పనులు పూర్తి చేశారు? అని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, మెగా ప్రాజెక్టు సిబ్బందిని ప్రశ్నించారు. మండలంలోని సహలాలపుట్టుగ గ్రామ నర్తు వీధి ప్రజలు తాగునీటి కోసం తమ వద్దకు వచ్చిన సందర్భం ప్రస్తావించిన ఆయన, ప్రజలకు నీరు అందించడంలో నిర్లక్ష్యం వహించే జెడ్‌పి చైర్మన్, సర్పంచ్‌లను ఏమనాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సేవలో ఉన్నామంటూ గొప్పలు చెప్పుకుంటూ ఇటువంటి నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. మండలంలోని రామయ్యపుట్టుగలో క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, మెగా ప్రాజెక్టు సిబ్బందితో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రూ.700 కోట్లతో పలాసలో మూడు, ఇచ్ఛాపురంలో నాలుగు మొత్తం ఏడు మండలాలకు 807 హేబిటేషన్లకు తాగునీరు అందించేందుకు ప్రాజెక్టు చేపట్టినట్లు వివరించారు. దీనికి సంబంధించి 535 కొత్త ట్యాంకులు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 251 ట్యాంకులు మాత్రమే పూర్తి చేశామని తెలిపారు. వాటిలో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 65, పలాస పరిధిలోని మూడు మండలాల్లో 186 ట్యాంకులు నిర్మించారని చెప్పారు. దీనిపై విప్ అశోక్ స్పందిస్తూ ఇంటింటికీ నీరు ఇచ్చేశామంటూ గొప్పలు చెప్పుకోవడం సులభం. కానీ, ట్యాంకులు సగం కూడా పూర్తి కాలేదని, పనులు లోపభూయిష్టంగా ఉన్నాయని, పైపులైన్లలో లీకులు వస్తున్నాయన్నారు. ఇలాంటి వ్యవస్థతో ప్రజలకు నీరు ఎలా ఇస్తారు అంటూ ప్రశ్నించారు. గత పాలకులు గొప్పలు చెప్పుకోవడం పక్కనపెడితే, మీరేం చేస్తున్నారో ఒకసారైనా పరిశీలించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. కొత్తగా జెజెఎం పథకం కింద రూ.108 కోట్లు మంజూరు చేశామన్న ఆయన, ఈ నిధులను ప్రాధాన్యతా క్రమంలో వినియోగించి ప్రతి ఇంటికీ తాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎస్ఇ శంకర్‌బాబు, డిఇ ఎ.వి మురళీ మోహన్, ప్రాజెక్టు డిఇ గోపాలకృష్ణ, నాలుగు మండలాల ఎఇలు, మెగా ప్రాజెక్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్ల మంజూరులో నూతన విధానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

విద్యుత్ కనెక్షన్ల మంజూరులో నూతన విధానం పారదర్శకంగా అమలు చేయనున్నట్లు ఇపిడిసిఎల్ ఎస్ఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలన, అంచనా అవసరం లేకుండా ఈ విధానం అమలు ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని తెలిపారు. గృహ వినియోగానికి ఒక కిలో వాట్‌కు రూ.1500, వాణిజ్యానికి రూ.1800, ప్రతి అదనపు కిలో వాట్‌కు రూ.రెండు వేలు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 20 నుంచి 150 కిలో వాట్స్‌కు రూ.12,600, హెచ్‌టి 75 నుంచి 150 కిలో వాట్స్‌కు రూ.4,400గా నిర్ణయించినట్లు వివరించారు. ఒక కిలోమీటరు పరిధిలోని వినియోగదారులకు డెవలప్‌మెంట్ ఛార్జీలు, సర్వీస్ లైన్ ఛార్జీలతో కలిపి స్థిరంగా నిర్ణయించడంతో ఎటువంటి అదనపు ఛార్జీల భారం ఉండదని స్పష్టం చేశారు. దీనివల్ల కనెక్షన్ జారీ ప్రక్రియ సులభతరం, వేగవంతమవుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 1912 టోల్‌ఫ్రీ నంబర్, www.apeasterrnpower.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

మాలా మీరు చేయొద్దు

జూదరులకు వినూత్న శిక్ష

జూదం, బహిరంగ మద్యపానం నిషేధం వద్దని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వ్యక్తులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పేకాటలో పట్టుబడిన ఐదుగురు వ్యక్తులతో నగరంలోని అరసవల్లి కూడలి వద్ద జూదమాడటం చట్టరీత్యా నేరం, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధం అనే ప్లకార్డులతో పోలీసులు గురువారం అవగాహన కల్పించారు. శ్రీకాకుళం నగరంలో ఐదుగురు జూదమాడుతూ పోలీసులకు పట్టుబడగా, వారిని సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితులకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించడంతో పాటు పది రోజుల పాటు పలుచోట్ల ప్రజలకు అవగాహన కల్పించేలా జూదం నిషేధం, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధం ప్లకార్డులు ప్రదర్శించాలని జడ్జి తీర్పునిచ్చారు. ఈ తీర్పును అనుసరించి ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు సాయంత్రం ఐదు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ఈ ప్లకార్డులతో వారితో పోలీసులు అవగాహన కల్పించినట్లు డిఎస్‌పి వివేకానంద తెలిపారు. చట్టాలను గౌరవించి జూదం, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని సందేశం ఇప్పించామన్నారు. డిఎస్‌పి వెంట సిఐలు పైడపునాయుడు, ఈశ్వరరావు, ట్రాఫిక్ సిఐ నాగరాజు, ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ ఉన్నారు.

గిరిజన ఉత్పత్తులకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

గిరిజన ఉత్పత్తుల స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

గిరిజనుల అటవీ ఉత్పత్తులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని కొత్తకోట వారి వీధి వద్ద సీతంపేట గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన గిరిజన ఉత్పత్తుల స్టాల్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతంపేటలో ఉత్పత్తి చేసే పలురకాల ఉత్పత్తులు రాష్ట్రంలో ఎంతో ఆదరణ పొందుతున్నాయని తెలిపారు. సమాజంలో రోజురోజుకీ పెరుగుతున్న ఆరోగ్య అసమతుల్యతలను మెరుగుపరుచుకోవడానికి సేంద్రియ ఉత్పత్తులే శ్రేయస్కరమని చెప్పారు. ఎటువంటి హానికరం లేని గిరిజన ఉత్పత్తుల వాడకం ద్వారా ప్రజలు కూడా ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించవచ్చని తెలిపారు. పట్టణంలో గిరిజన ఉత్పత్తుల షాపు అందుబాటులోకి రావడం వల్ల పట్టణ ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. సేంద్రియ ధాన్యాలు, మసాలా దినుసులు, తేనె, వన్య ఉత్పత్తులు తదితర పదార్థాలు ఈ విక్రయ కేంద్రంలో లభ్యమవుతాయని విక్రయదారులు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, ఎస్.మురళీధర్, సిమ్మ మాధవి, నాగళ్ల మురళీధర్ యాదవ్, మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ చాపర సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సనపల అన్నాజీరావు, ఐటిడిఎ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

13న 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ రాక

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఈనెల 13న 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటలకు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఉపాధి హామీ, పిఎం గ్రామ సడక్ యోజన, జల్ జీవన్ మిషన్, అమృత్, సూర్యఘర్ వంటి కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు, పురోగతిపై ప్రధానంగా సమీక్షిస్తారని తెలిపారు.

'జల్ జీవన్' పనుల పర్యవేక్షణకు గ్రామ కమిటీలు

- నీటి నాణ్యత పరీక్ష కిట్లు వెంటనే కొనుగోలు చేయాలి
- డిప్యూటీ ఎంపిడిఒలకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జల జీవన్ మిషన్ (జెజెఎం) కార్యక్రమాన్ని వేగవంతం చేయడానికి, క్షేత్రస్థాయిలో పనుల పర్యవేక్షణకు తక్షణమే గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ డిప్యూటీ ఎంపిడిఒలను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డిప్యూటీ ఎంపిడిఒలతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతి గ్రామంలో విలేజ్ వాటర్ అండ్ శానిటేషన్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కమిటీలో 15 మంది సభ్యులు ఉండాలని, అందులో సగం మంది మహిళలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. సర్పంచ్ ఈ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. జెజెఎంకు సంబంధించిన అన్ని పనులూ ఈ కమిటీ తీర్మానం ద్వారానే చేపట్టాలని స్పష్టం చేశారు. 'హర్ ఘర్ జల్' డిక్లరేషన్ సాధించే ప్రక్రియ వేగం పుంజుకోవాలని, డిక్లరేషన్ చేసే పనికి సంబంధించి ఒక్క నిమిషం నిడివి గల వీడియోను తప్పక రికార్డు చేయాలన్నారు. నీటి నాణ్యతను పరీక్షించడానికి అవసరమైన టెస్టింగ్ కిట్‌లను వెంటనే కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పలాసలో వ్యాపారి కిడ్నాప్

- నరసన్నపేటలో విడిచిపెట్టిన వైనం
- ఆర్థిక లావాదేవీలే కారణం

ప్రజాశక్తి - పలాస

పలాసలో నివాసం ఉంటున్న జీడి వ్యాపారి, బ్యాంకు కన్సల్టెంట్ వైశ్యరాజు లక్ష్మీనారాయణ రాజు కిడ్నాప్ ఘటన పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో కలకలం రేపింది. కాశీబుగ్గ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించడంతో వ్యాపారిని నరసన్నపేట ప్రాంతంలో విడిచిపెట్టి వెళ్లిపోయారు. బాధితుడు, పోలీసులు కథనం ప్రకారం ఆమదాలవలసకు చెందిన వైశ్యరాజు లక్ష్మీనారాయణ రాజుకు పలాసకు చెందిన మాధవితో వివాహం కావడంతో 20 ఏళ్లుగా పలాసలో నివాసం ఉంటున్నాడు. జీడి వ్యాపారంతో పాటు బ్యాంకు కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు ఆమదాలవలసలో ఆస్తులు, దుకాణాలు ఉన్నాయి. లక్ష్మీనారాయణ ఆమదాలవలసలకు చెందిన వ్యాపారి వేణుగోపాల్ వద్ద రెండు పర్యాయాలు సుమారు రూ.1.77 కోట్లు అప్పు తీసుకుని తన షాపును ఆయన పేరున మార్టిగేజ్ చేశాడు. ఇటీవల తన షాపును అమ్మేందుకు లక్ష్మీనారాయణ పలువురు వ్యాపారులకు చూపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న వేణుగోపాల్ షాపు తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కిడ్నాప్ ప్లాన్ వేశాడు. ఆమదాలవలసకు చెందిన తన స్నేహితునితో కలిసి గురువారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో కారులో పలాస వచ్చారు. అదే సమయంలో లక్ష్మీనారాయణ తన స్నేహితులతో కలిసి పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో దుకాణం వద్ద టీ తాగుతున్నాడు. వేణుగోపాల్ స్నేహితుడు శ్రీనివాసరావు మాట్లాడాలని చెప్పి లక్ష్మీనారాయణను కారులో ఎక్కించుకుని ఆమదాలవలస సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయాలని కారులో తీసుకెళ్లి చితకబాదారు. లక్ష్మీనారాయణను తీసుకెళ్లడం చూసిన స్నేహితులు ఆయన భార్య మాధవికి సమాచారం అందించారు. తన భర్తను ఆమదాలవలసకు చెందిన వేణుగోపాల్ కిడ్నాప్ చేశారని మాధవి కాశీబుగ్గ పోలీసుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ ఆమదాలవలస సిఐతో మాట్లాడారు. వేణుగోపాల్ నంబరు తీసుకున్న సిఐ సూర్యనారాయణ ఆయనకు ఫోన్ చేసి మాట్లాడడంతో సమస్య జటిలం అవుతుందని భావించి లక్ష్మీనారాయణను నరసన్నపేట ప్రాంతంలో విడిచిపెట్టారు. అక్కడ్నుంచి లక్ష్మీనారాయణ రాజు ఇంటికి చేరుకున్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ తెలిపారు.

మహారాజశ్రీ ఎ.పి. కో-ఆపరేటివ్ ట్రిబ్యునల్ విజయవాడ వారి ఎదుట
O.P. No. 85/2025
Between:
Peoples MACCS Ltd., Vijayawada
Rep.by its Authorized Signatory – పిటీషనర్
మరియు
వల్లంకొండ కృష్ణకాంత్ మరియు 6 ఇతరులు – రెస్పాండెంట్స్
ఆర్డర్ V, రూలు 20, సివిల్ ప్రొసీజర్ కోడ్‌ను అనుసరించి జారీ చేసిన నోటీసు
To: R1 వల్లంకొండ కృష్ణకాంత్, S/o. (లేట్) రామ్మోహన్ రావు, R/o. డోర్.నెం. 16121/1, C/o. వబ్బిలిశెట్టి సుబ్బారావు, వబ్బిలిశెట్టి వారి వీధి, ఆముదాలవలస, శ్రీకాకుళం జిల్లా.
R6 వల్లంకొండ నీరజ్, S/o. (లేట్) రామ్మోహన్ రావు, R/o. డోర్.నెం. 16121/1, C/o. వబ్బిలిశెట్టి సుబ్బారావు, వబ్బిలిశెట్టి వారి వీధి, ఆముదాలవలస, శ్రీకాకుళం జిల్లా.
పై పిటీషన్‌లో 1,6వ ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తము ది. 24-11-2025న ఉదయం 10-30 గంIIలకు మీరు స్వయంగా కానీ లేదా మీ తరపున సరైన వకాలత్ పొందిన న్యాయవాది ద్వారా కానీ పై కోర్టు వారి ఎదుట హాజరై పై పిటీషన్‌లో మీ అభ్యంతరాలను తెలియజేసుకోవలెను లేని ఎడల పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియ జేయడమైనది.
(By order of the Hon'ble AP Co-operative Tribunal, Vijayawada)
ఇట్లు
C.V. సుబ్రహ్మణ్యేశ్వరరావు, న్యాయవాది, గాంధీనగర్, విజయవాడ-3.
సెల్: 93999 75668

పండగను వైభవంగా నిర్వహించాలి

అరసవల్లి: వచ్చే ఏడాది ఏప్రిల్‌లో అరసవల్లి అసిరితల్లి అమ్మవారి పండుగను అత్యంత వైభవోపేతంగా సంతోషంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రజలకు పిలుపు నిచ్చారు. అరసవల్లి పండుగలను పురస్కరించుకొని అసిరితల్లి అమ్మవారిని దర్శనం చేసుకొని గురువారం అరసవల్లిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అరసవల్లికి అను సంధానంగా ఉన్న రోడ్లను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే గ్రామంలో పాడైన రోడ్లకు సంబంధించి మరమ్మతులు చేపట్టాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులకు వివరించారు. ముఖ్యంగా గ్రామంలో ఎక్కడా పారిశుధ్య లోపం లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు చెత్తను తొలగించడం, కాలువలను శుభ్రం చేయడం వంటి పనులు సకాలంలో చేయాలన్నారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా ట్యాంకర్లను, బయో టాయిలెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. అదే విధంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని రోడ్లను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తూ ఉండాలని, ముఖ్యంగా పార్కింగ్ స్థలాలపై దృష్టి సారించి పండుగలకు వచ్చే వారికి

అరసవల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శంకర్

సూచనలు చేయాలని వివరించారు. పండుగకు జిల్లా వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున రద్దీ దృష్ట్యా అన్ని శాఖల సిబ్బంది సమన్వయం చేసుకొని ప్రజలకు సౌకర్యాలు కల్పించాలన్నారు. పండుగ అనంతరం కూడా అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని తెలిపారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఈ సందర్భంగా పండుగ కమిటీ సభ్యులు, టిడిపి నాయకులు, గ్రామపెద్దలతో కలిసి పర్యటించారు.

విద్యార్థినులకు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కేన్సర్ రహిత సమాజమే లక్ష్యం

శ్రీకాకుళం సిటీ: కేన్సర్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ టి.విక్టర్‌పాల్ అన్నారు. భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (బిహెచ్‌ఆర్‌సి) జ్యోత్స్న, కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జెమ్స్ వైద్య కళాశాల, కిమ్స్ ఆస్పత్రుల సహకారంతో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రాణాంతకమైన కేన్సర్ వ్యాధిపై ప్రజల్లో అప్రమత్తత అవసరమని, తమ కళాశాలలో విద్యార్థినులు, సిబ్బంది కోసం ప్రత్యేకంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (బిహెచ్‌ఆర్‌సి) నేషనల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రభు మాట్లాడుతూ మహిళలు, బాలికల్లో ఎక్కువగా కేన్సర్ లక్షణాలు కనిపిస్తున్నందున వారి కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు కోసం జెమ్స్, కిమ్స్ సహకారం తీసుకుంటున్నట్లు చెప్పారు. బిహెచ్‌ఆర్‌సి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ వైద్య పరీక్షలు చేయించుకునేందుకు మహిళలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని, పరీక్షల నిర్వహణ ద్వారా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టవచ్చునన్నారు. బిహెచ్‌ఆర్‌సి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు పి.మణిశర్మ మాట్లాడుతూ కేన్సర్ వ్యాధిపై కూడా బాలికలకు అవగాహన అవసరమన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం.కీర్తి, బిహెచ్‌ఆర్‌సి మహిళా విభాగం జిల్లా ప్రెసిడెంట్ అందవరపు జ్యోతిర్మయి, మహిళా పాలిటెక్నిక్ కళాశాల వివిధ విభాగాధిపతులు యమున, సంజయ్, సిబ్బంది భార్గవి, శివ, ప్రభ, రాజేశ్వరి, లలితకుమారి, అమిత, హాలీనాబేబీ రాణి, వైద్యులు డాక్టర్ జి.లాస్య, డాక్టర్ శ్రీవల్లి, జెమ్స్, కిమ్స్ మార్కెటింగ్ జిఎం ప్రవీణ్, డిజిఎం విజయ్ భాస్కర్, మార్కెటింగ్ మేనేజర్ రవిబాబు, పిఆర్‌ఒలు పూర్ణ, తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

హరిపురం సమస్యలకు నిలయం

గిరిజన గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నాయి. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి తమ గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆశగా ఎదురు చూస్తున్న గిరిజనులకు నిరాశే ఎదురవుతుంది. దీంతో ఆయా గ్రామాల గిరిజనులు సమస్యలతో సతమతమవుతున్నారు.

- రాళ్లు తేలిన రహదారి
- మరుగుదొడ్లు లేక ఆరుబయటే గతి

హరిపురం పల్లాపురంలో పేరుకుపోయిన పారిశుధ్యం

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రానికి సమీపంలో, మరోవైపు పాలకొండ పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ గిరిజన గ్రామానికి సమస్యలు అనునిత్యం వేధిస్తున్నాయి. మండలంలోని డొంకలపర్త పంచాయతీ పరిధిలో ఉన్న హరిపురం పల్లాపురం గ్రామంలో సమస్యలు దశాబ్దాలుగా తిష్ట వేశాయి.

చీరలను కట్టి మరుగుదొడ్లుగా నిర్మించుకున్న గిరిజనులు

దారి కష్టాలు తీరేది ఎప్పుడు...?

పాలకొండ, శ్రీకాకుళం ప్రధాన రహదారికి అనుకుని తుడ్డలి గ్రామ సమీపంలో నుంచి హరిపురం పల్లాపురం గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రహదారి మొత్తం రాళ్లుతేలి నరకాన్ని చూపిస్తున్నాయి. దశాబ్దాల కాలంగా రహదారి పూర్తి కాకపోవడంతో అత్యవసర సమయంలో వాహనాలు కూడా వచ్చే పరిస్థితి లేదని గిరిజనులు వాపోతున్నారు. మరోవైపు అదే గ్రామంలో నుంచి పాలకొండకు వెళ్లేందుకు రహదారి ఉన్నప్పటికీ అది మట్టిరోడ్డు కావడంతో అనునిత్యం గోతులతోనే దర్శనం ఇస్తుందని వాపోతున్నారు. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నప్పటికీ రహదారి పూర్తికాలేదని వాపోయారు.

పారిశుధ్యం అధ్వానం

గ్రామంలో అపారిశుధ్యం నెలకొంది. పేరుకుపోయిన చెత్తను తొలగించమని పంచాయతీ పాలకవర్గానికి పలుమార్లు ఫిర్యాదు చేశామని, అయినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. దీంతో దోమలు, వీధికుక్కలు విహారం చేస్తూ వ్యాధులకు గురవుతున్నామని వాపోతున్నారు.

రహదారులపైనే మురుగునీరు

రోడ్డుకు ఇరువైపుల సైడ్ కాలువలు పూర్తికాకపోవడంతో మురుగనీరు రోడ్లపైకి వస్తుందని, ముఖ్యంగా వర్షాకాలంలో అవస్థలు ఎదుర్కొంటున్నామని విమర్శిస్తున్నారు.

మరుగు కోసం ఆరు బయటకే

గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన వ్యక్తిగత మరుగుదొడ్లు కొంత మంది నిర్మించుకున్నప్పటికీ నీటి సౌకర్యం లేకపోవడంతో మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో అర్ధరాత్రి ఆరు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని మహిళలు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకవర్గం స్పందించి తమ గ్రామానికి రహదారి పూర్తి చేయాలని, అలాగే సైడ్ కాలువలను ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా పారిశుధ్యం మెరుగుపరిచేందుకు కృషి చేయాలన్నారు. అంతే కాకుండా మరుగుదొడ్లు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పాడైన కాలువ

రహదారి లేదు

దశాబ్దాలుగా రహదారి లేకపోవడంతో అనునిత్యం ఉన్న రహదారిపైనే నడక సాగిస్తున్నాం. అత్యవసర సమయమైనప్పుడు, వర్షాలు పడుతున్న సమయంలో ఇబ్బందులకు గురవుతున్నాం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి బాగుకు కృషి చేయాలి.

- చీమల కృష్ణ, గ్రామస్తుడు

మరుగుదొడ్లు నిర్మించాలి

గ్రామంలో ఉన్న మరుగు దొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రభుత్వం కొత్తగా మరుగుదొడ్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. అత్యవసర సమయంలోనూ ఆరు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

- నిమ్మక త్రినాథరావు, గ్రామస్తుడు

గ్రామసభలో మాట్లాడుతున్న ఎపిఒ శ్రీనివాసరావు

ఉపాధి పనులు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- పొందూరు

గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండల అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహనరావు అన్నారు. పొందూరులో సర్పంచ్ రేగిడి లక్ష్మి అధ్యక్షతన గురువారం ఉపాధిహామీ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో 2026 – 27 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం ద్వారా సుమారు రూ.కోటి 70 లక్షలతో పనులు చేపట్టేందుకు గుర్తించినట్లు ఎపిఒ పైల శ్రీనివాసరావు తెలిపారు. పంచాయతీలోని చెరువుల్లో, కాలువల్లో పూడికతీత, రైతుల పొలాల్లో నీటి కుంటలు, తోటల పెంపకం వంటి పలు పనులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ పి.సింహాచలం, వైస్ ప్రెసిడెంట్ గోవిందరావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు చిన్నరంగా, వార్డు సభ్యులు మురళీ, ఇఒ మోహన్‌బాబు, టిడిపి నాయకులు రవి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు. అలాగే లోలుగులో జాతీయ ఉపాధిహామీ పథకం గ్రామసభను నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, కూటమి నాయకులు లోలుగు శ్రీరామమూర్తి, సాయికుమార్, రఘు, ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

చాపరాయిలో భూ సర్వే

ప్రజాశక్తి- మందస

మండలంలోని కొండల్లోగాం రెవెన్యూలో చాపరాయి కాలనీలో గిరిజనులకు, గిరిజనేతరలకు మధ్య భూవివాదం రగులుతుంది. గిరిజనులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేయడంతో విఆర్‌ఒ తులసీదాసు, మండల సర్వేయరు బాబూరావు గురువారం భూ సర్వే చేశారు. సర్వే ప్రాప్తికి భూమి రికారు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు మద్దిల రామారావు, రైతు కూలీ సంఘం నాయకులు కోనేరు రమేష్, గిరిజన సంఘం నాయకులు సవర నర్సింహులు, సవర జగ్గారావు, సవర జయరాజు, లక్ష్మీనారాయణ, లక్ష్మణ, హరికృష్ణ, బాలకృష్ణ, తిరుపతి, తులసి, ఉమాపతి, నారాయణ, కుమార్ పాల్గొన్నారు.

ఆహారాన్ని పంపిణీ చేస్తున్న చిన్ను

వృద్ధులకు ఆహారం పంపిణీ

ఆమదాలవలస: కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని లెప్రసీ కాలనీలో అన్నార్తులకు ఆహారాన్ని పంపిణీ చేశారు. సరుబుజ్జిలి మండలం విజయరాంపురానికి చెందిన కూన హర్షవర్ధన్ భార్య రేఖ జన్మదినం సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది వృద్ధులు, వికలాంగులు, అనాథలకు ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కృత్విక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) మాట్లాడుతూ ప్రతి ఏడాది ఫౌండేషన్ తరపున రక్తదాన శిబిరాలు, ఆహార పంపిణీ వంటి సేవా కార్యక్ర మాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ప్రజాప్రయోజన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో పూజారి యశ్వంత్, రాము, ఆనంద్, రాజు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

లావేరు: మండలం బుడుమూరు ఉన్నత పాఠశాలలో గురువారం డివిజన్ శక్తిటీమ్ సభ్యులు సందర్శించారు. బాల్య వివాహాలు, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, గృహహింస, లైంగిక వేధింపులు, మహిళా వేధింపులు, గంజాయి, మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన కల్పించారు. వివిధ టోల్ ఫ్రీ నెంబర్లు 1098, 1972, 1098, 1091, 181, 1930, 112 కోసం వివరించారు. శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బి.ఉమా రాణి, బి.అనసూయ, పి.కుమార్ బాబు, గంజాయి రహిత జిల్లా నోడల్ అధికారి పూజారి గోవిందరావు, హెచ్‌ఎం రువ్వ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

15 నుంచి మ్యాజిక్ వర్క్‌షాప్

ప్రజాశక్తి- అరసవల్లి

ఉత్తరాంధ్ర స్థాయి మ్యాజిక్ వర్క్‌షాప్‌ను ఇల్లీసుపురం యుటిఎఫ్ భవనంలో నవంబర్ 15, 16, 17 తేదీల్లో నిర్వహిస్తారని యుటిఎఫ్ రాష్ట్ర ప్రతినిధి గొంటి గిరిధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుప్పిలి కామేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. ఈ మూడు రోజులు జెవివి రాష్ట్ర నాయుకులు బాలబాయన్న వర్కుషాప్‌ను నిర్వహిస్తారన్నారు. ఔత్సాహికులు, సైన్స్ ఉద్యమ కార్యకర్తలు ఈ అవగాహన సదస్సులకు పాల్గొనడానికి 9493044470 నంబర్‌కు విశాఖ పట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లా కార్యకర్తలు పేర్లు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అభినందిస్తున్న విసి రజని తదితరులు

రాజశేఖరరావుకు అభినందన

ఎచ్చెర్ల : రాష్ట్ర బిసి, ఒబిసి ఉద్యోగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షునిగా ఎన్నిక కావడంపై డా.బిఆర్‌ఎయు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. చింతాడ రాజశేఖరరావును వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని, రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య గురువారం అభినందనలు తెలియజేశారు. ఈ పదవి ద్వారా భవిష్యత్‌లో చేపట్టే సేవా, సంక్షేమ కార్యక్రమాలు యూనివర్సిటీ ప్రతిష్ట పెంచేలా ఉండాలని రాజశేఖరరావును సూచించారు.

ఎమ్మెల్యేను కలిసిన ఇన్‌ఛార్జి ఎంపిపి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఎచ్చెర్ల ఇన్‌ఛార్జి మండల పరిషత్ అధ్యక్షుడిగా (ఎంపిపి) నియామకమైన జరుగుళ్ల విజయ శంకరరావు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మండల అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు చౌదరి నారా యణమూర్తి (బాబి), గాలి వెంకట రెడ్డి తదితరులున్నారు.

12న ఆఖరిమెట్టు నవల ఆవిష్కరణ

ప్రజాశక్తి- అరసవల్లి

ఈ నెల 12న ఎన్‌టిఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో జరగనున్న సిక్కోలు పుస్తక మహోత్సవంలో ఉపాధ్యాయులు కూన రంగనాయుకులు రచించిన ఆఖరిమెట్టు నవల ఆవిష్కరణ, కూనకథలు కధా సంపుటి పరిచయ కార్యక్రమం ఉంటుందని, ఆ ఆవిష్కరణ కార్యక్రమానికి సివిల్ సప్లై డైరెక్టర్ ఆర్ గోవిందరావు పాల్గొంటారని రంగ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కవిత సంకలనాలు కూడా పుస్తక మహోత్సవంలో పరిచయం చేయబోతున్నట్లు తెలుగు రచయితల వేదిక ఒక ప్రకటనలో తెలిపారు. పుస్తక మహోత్సవ కార్యక్రమం ఈనెల 11న ఎన్‌టిఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమవుతుందని సంస్థ కమిటీ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ పుస్తక మహోత్సవంలో ఎంతోమంది కవులు, కళాకారులు పాల్గొంటారని, పుస్తక ఆవిష్కరణలు, పుస్తకాల పరిచయాలు, ఏకపాత్రాభినయనాలు, కవి సమ్మేళనాలు, 100 పుస్తక ప్రచురణ సంస్థచే వేలాది ప్రదర్శనలు, సాహిత్య, సాంస్కృతిక, వైజ్ఞానిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ముందస్తు భద్రతా ఏర్పాట్లు పరిశీలన

పొందూరు: మండలం రాపాక గ్రామ కొండపై శ్రీదేవిభూదేవి సమేత కళ్యాణం వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాసం మూడో శనివారం నిర్వహించనున్న కళ్యాణ మహోత్సవానికి చేపట్టిన భద్రతా ఏర్పాట్లును గురువారం సిఐ పి.సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయంలో చేపట్టే కళ్యాణం, అన్నదాన కార్యక్రమానికి ఎంతమంది వస్తారని కమిటీ సభ్యులను ప్రశ్నించారు. సుమారు 5 వేల మంది హాజరయ్యే అవకాశం ఉందని కమిటీ సభ్యులు తెలిపారు. కార్లు, ద్విచక్రవాహనాలను కొండపైకి అనుమతించకుండా కిందనే నిలుపుదల చేయాలని సూచించారు. కాశీబుగ్గలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో 9 మంది మృతి చెందిన నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందుస్తుగా పటిష్టమైన భద్రతా చర్యలను కమిటీ సభ్యులు చేపట్టాలన్నారు. అలాగే కృష్ణాపురంలోని ఆనందాశ్రమం 20వ వార్షికోత్సవం సందర్భంగా కార్తీకమాసం నాలుగో ఆదివారం నిర్వహించే హిందూదార్మిక మహా సమ్మేళనానికి భద్రతా ఏర్పాట్లును ఆంధ్రప్రదేశ్ సాదుపరిషత్ అధ్యక్షులు స్వామీ శ్రీనివాసనంద సరస్వతిని సిఐ పి.సత్యనారాయణ అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు ఎస్ఐ వి.సత్యనారాయణ ఉన్నారు.

కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సిఐ సత్యనారాయణ

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి

న్యాయమూర్తి యు.మాధురి

పలాస : బహుమతులను అందజేస్తున్న జడ్జి మాధురి

ప్రజాశక్తి- పలాస

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలని, చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని పలాస జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి యు.మాధురి అన్నారు. ఈ నెల 9న జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక హక్కులు, విధులు ఆదేశిక సూత్రాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు గురువారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు చిన్నం నాయుడు, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు భీమశంకర్ పర్యవేక్షించారు. అనంతరం విజేతలకు పలాస కోర్టు ఆవరణలో న్యాయమూర్తి యు.మాధురి బహుమతులను ప్రదానం చేశారు. ఈ పోటీలో మొదట స్థానంలో జె.తనుశ్రీ, రెండవ స్థానంలో ఎం.నేహా, టి.నవ్య, వి.గాయత్రికి కన్సోలేషన్ బహుమతి లభించింది. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు మహమ్మద్ పియాజ్ అహ్మద్, ఉపాధ్యక్షులు ప్యానల్ లాయర్ బి.కామేశ్వరరావు పట్నాయక్, సీనియర్ న్యాయవాది జి.ప్రభాకరరావు, టి.మురళీమోహనరావు, వి.రవి, పి.చిట్టిబాబు, కానిస్టేబుల్ బి.శ్రీనివాసరావు, కోర్టు సూపరింటెండెంట్ కె.కృష్ణారావు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొత్తూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కందికట్ల రాణి అధ్యక్షతన జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ప్రాథమిక, హక్కులు, విధులు అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎ.గోవిందరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురులో గురువారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామని ప్రిన్సిపాల్ శరత్‌బాబు తెలిపారు. బాలురు, బాలికలు, కవిటి, సోంపేట, కంచిలి, మందస మండం బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వ్యక్తిగత క్విజ్ పోటీలో ప్రథమ బహుమతి సోనాలి సాహు సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, రెండో బహుమతి ఎస్.లక్ష్మణ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కంచిలి, మూడో బహుమతి అంజలి బెహరా ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికలు ఇచ్ఛాపురం గెలుచుకున్నారని అన్నారు. అనంతరం విజేతలకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు నల్లన రమేష్, బోరుభద్ర సురేష్ కుమార్, పైడి సురేష్ కుమార్, నూకల రాజశేఖర్, చింతాడ పాపారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఔషధ మొక్కల సాగుకు ప్రోత్సాహం

ప్రజాశక్తి- కవిటి

రైతుల ఆదాయం పెంపుతో పాటు ఆరోగ్య రక్షణకు దోహదపడే ఔషధ మొక్కల సాగుపై దృష్టి సారించాలని ఎపి మెడికల్ అండ్ అరోమాటిక్ ప్లాంట్స్ బోర్డు విజయవాడ ఉప కార్యనిర్వాహక అధికారి కె.ప్రదీప్‌కుమార్ సూచించారు. మండలంలోని బట్టివాణిపాలెంలో రైతులతో గురువారం సమావేశమైన ఆయన ఔషధ, సువాసన మొక్కల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో లాంగ్ పెప్పర్ (మిరియాలు), అశ్వగంధ, లెమన్‌గ్రాస్ (నిమ్మగడ్డి), వట్టివేరు వంటి ఔషధ పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. రైతులు ఈ పంటల సాగుకు ముందుకు వస్తే ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తుందని చెప్పారు. బోర్డు ఆధ్వర్యాన గిడ్డంగుల నిర్మాణానికి సబ్సిడీ మంజూరు చేస్తామన్నారు. భవిష్యత్‌లో మండలంలో డిస్టిలేషన్ యూనిట్లు ఏర్పాటు చేసే ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని వివరించారు. రైతులు అవసరాలను వివరించి ప్రతిపాదనలు అందిస్తే, సంబంధిత పథకాలను ప్రాధాన్యత క్రమంలో మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హార్టికల్చర్ విభాగం ఆధ్వర్యాన సాగు చేయదగిన నేలలు, నీటి వనరులు, మార్కెట్ లింకులు మొదలైన అంశాలపై అధికారులు వివరించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి పి.మాధవి, కన్సల్టెంట్ ఎం.విజయకుమార్, బట్టివాణిపాలెం రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విజయకుమార్

అవగాహనతోనే కేన్సర్ దూరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కేన్సర్‌పై అవగా హనతో ఈ వ్యాధికి దూరంగా ఉండవచ్చునని ఏషియన్ కేన్సర్ ఆస్పత్రి డాక్టర్ నందాన రవీంద్ర అన్నారు. జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం శుక్రవారం సందర్భంగా గురువారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ప్రస్తుతం కేన్సర్ ప్రమాదకరంగా మారుతుందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రతిఏటా ప్రపంచ వ్యాప్తంగా పొగాకు ఉత్పత్తులు వాడకం వలన సుమారు 50 లక్షల మంది మృత్యువాత పడు తున్నారన్నారు. మన దేశంలో ప్రతి రోజు సరాసరి 2,200 మంది చనిపోతున్నారని అన్నారు. ధూమపానం వలన మతి చెందిన వారు దేశంలో అధికంగా ఉన్నట్లు గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ వెల్లడించిందన్నారు. ప్రతిరోజు వేల సంఖ్యలో భారతీయులు పొగాకుకు బానిస లౌవుతున్నారని చెప్పారు. ముఖ్యంగా పొగాకు ఉత్పత్తులైన ఖైనీలు, పాన్పరాగ్లు, గుట్కాలు, జర్దాలు, చుట్టలు, బీడీలు, సిగరెట్లు, మొదలగు వాటిలో దాదాపు నాలుగు వేల రకాల హానికర రసాయనాలు ఉంటాయన్నారు. సమాజంలో చాలా మంది వీటిని నమల డం, అడ్డ పొగ, పొగతాగడం ఏ రూపంలో తీసుకున్నా రకరకాల రసాయనాలు శరీరంలోకి ప్రవేశించి రక్తనాళాలు దెబ్బతిని కాళ్లలోని రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం వలన రక్తప్రసరణ తగ్గి 'పెరిఫెరల్ వాస్క్యులార్ డిసీజ్' (బర్జర్స్ డిసీజ్) అనే వ్యాధి రావడం, పలు రకాల కేన్సర్లకు గురి చేస్తాయన్నారు. ఊపిరితిత్తుల, నోటి, పెదవుల, నాలుక, స్వరపేటిక, గొంతు, అన్నవాహిక, కాలేయం, క్లోమము, జీర్ణాశయ, మూత్రాశయ, కిడ్నీ కేన్సర్, రక్తపోటు పెరిగి గుండె జబ్బులు రావడం, ఛాతిలో మంట, దగ్గు, ఆయాసం రావడం, పక్షవాతం, ఆస్టియో ఫోరోసిస్, కంటి చూపు మంద గించడం, దంతాలు రంగుమారడం, దంతాలు ఊడిపోవటం, పురుషుల్లో సెక్స్ సామర్థ్యం తగ్గడం, స్తంబన లోపం, శుక్రకణాల సంఖ్య (స్పెర్మ్ కౌంట్) తగ్గడం, స్త్రీలలో గర్భ సంచి కేన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్, సంతాన సామర్థ్యం తగ్గి సంతానం కలుగకపోవడం, గర్భస్రావం, నెలలు నిండక ముందే కాన్పురావడం, మృతశిశువులు పుట్టడం, తక్కువ బరువుతో శిశువు పుట్టడం మొదలగు రుగ్మతలకు గురై జీవితకాలం తగ్గి వ్యక్తులు మరణిస్తారని అన్నారు. సరదాగా సిగరెట్ తాగే అలవాటు 'నికోటిన్'కు బానిసై జీవితాంతం ఒక వ్యసనంగా మారి డబ్బుపెట్టి సిగరెట్లు కొని వారి మరణాల్ని వారే కొనితెచ్చు కొంటున్నారని, ధూమపానం అనేక అనర్థాలకు, దుష్ప్రభావాలకు దారి తీస్తుందని తెలిసినా ధూమపాన వ్యసన పరులు అస్తమానం పొగ పీలుస్తూ ఆరోగ్యం గుళ్ళ చేసుకుంటు న్నారని, పొగతాగే వారికి దుష్ప్రభావాలు తప్పవని, వాళ్ళ ప్రక్కనే ఉంటూ, వాళ్లు విడిచి పెట్టే పొగ (పాసివ్స్మోకింగ్– సెకెండ్ హేండ్ స్మోక్) పీల్చే వారికి కూడా పరోక్షంగా కేన్సర్‌కు గురయ్యే ప్రమాదం ఉందన్నారు.


డాక్టర్ నందాన రవీంద్ర

వృద్ధునికి గాయాలు

చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

కంచిలి : మండల కేంద్రం సమీ పంలోని జాతీయ రహదారి వద్ద గురు వారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో దాకరాపల్లికి చెందిన బడాయి ధర్మారావు గాయపడ్డాడు. ధర్మారావు పురుషోత్తపురంలోని తన బంధువుల ఇంటికి కాలినడకన స్వగ్రామం నుంచి ఉదయం బయలుదేరాడు. జాతీయ రహదారిని దాటు తుండగా పలాస వైపు నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న లారీ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడి తలకు తీవ్రగాయాలు కావడంతో వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో సోంపేట ఆస్పత్రికికి తరలించారు. క్షతగాత్రుడు తమ్ముడు భగీరథి ఇచ్చిన పిర్యాదు మేరకు ఎస్ఐ పారినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాను ఢీకొని వ్యక్తికి గాయాలు

నందిగాం : మండలంలోని దేవుపురం పంచాయతీ కొండతెంబూరు జాతీయ రహదారిపై గురువారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో దేవిపురానికి చెందిన వంజంగి సీతమ్మ గాయపడిందని హెచ్‌సి ఎం.కృష్ణారావు తెలిపారు. సీతమ్మ బస్సు ఎక్కేందుకు రోడ్డు దాటుతుంది. ఈ సమయంలో పలాస నుంచి టెక్కలి వైపు వెళ్తున్న వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె రెండు కాళ్లకూ గాయపడింది. ఆమెను మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు.

వ్యక్తికి 30 రోజుల జైలు శిక్ష

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం పట్టణం మిల్లు జంక్షన్ వద్ద బహిరంగ మద్యం బుధవారం సేవించడంతో మండల వీధికి చెందిన కాగన గణేష్‌పై కేసునమోదు చేసి అరెస్టు చేసినట్లు మొదటి పట్టణ ఎస్ఐ హరికృష్ణ చెప్పారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 30 రోజులు జైలుశిక్ష విధించినట్లు తెలిపారు. రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. బహిరంగ మద్యం సేవించటం, డ్రంక్ అండ్ డ్రైవ్, జూదం, పేకాట వంటి వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

బైండోవర్ చేస్తున్న తహశీల్దార్ మురళీమోహన్

12 మందిపై బైండోవర్

ప్రజాశక్తి- కవిటి

మద్యం దుకాణాలు నిబంధనలు పాటించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ ఎక్సైజ్ పరిధిలో పాత కేసుల్లో పట్టుబడిన 12 మంది వ్యక్తులను పిలిపించి తహశీల్దార్ మురళీమోహన్ వద్ద గురువారం బైండోవర్ చేశారు. బైండోవర్ కేసు ఏడాది వరకు అమలులో ఉంటుందని, దీన్ని అతిక్రమిస్తే బాండులో పేర్కొన్న విధంగా జరిమానా విధిస్తామని అన్నారు. ప్రజలు నాటుసారా, కల్తీ మద్యం, గంజాయిపై అప్రమత్తంగా ఉండి తమకు తెలిసిన సమాచారాన్ని 14405 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలని తెలిపారు. బైండోవర్ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ ఎన్.కృష్ణారావు, సిబ్బంది కాంతారావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రావివలస రేషన్ డిపో వద్ద గందరగోళం

టెక్కలి రూరల్ : మండలంలోని రావివలసలోని రేషన్ డిపో వద్ద గురువారం గందరగోళం నెలకొంది. డీలర్ సమయపాలన పాటించకపోవడం, అడిగితే డీలర్, ఆమె భర్త దురుసుగా ప్రవర్తించినట్లు కార్డుదారులు వాపోతున్నారు. కార్డుదారులు అధిక సంఖ్యలో డిపో వద్ద గుమిగూడడంతో డిపో నిర్వాహకులతో వాగ్వి వాదం చోటుచేసుకుంది. ఇదిలా ఉండగా మండల ంలోని రావివలసతో పాటు పలు డిపోలకు వస్తున్న బియ్యం బస్తాల్లో వ్యత్యాసం కనిపిస్తుందని చెబుతున్నారు.

డిపో వద్ద గుమిగూడిన కార్డుదారులు

మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

మురుగునీటిని శుభ్రపరచడమే లక్ష్యం

మున్సిపల్ కమిషర్ రామారావు

ప్రజాశక్తి- పలాస

మురుగునీటిని శుభ్రపరచడమే లక్ష్యంగా.. రానున్న రోజుల్లో ట్రీట్మెంట్ ప్లాంట్ల ఏర్పాటు ఆవశ్యకతపై పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు ప్రస్తావించారు. రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లతో తాడేపల్లిలో బుధవారం రాష్ట్ర పుర పరిపాలనా శాఖతో పాటు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ రవీంద్రబాబుల ఆధ్వర్యాన నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రానున్న మూడేళ్లలో మురుగు నీటిని ట్రీట్మెంట్ ప్లాంట్ల ద్వారా శుభ్రపరచడానికి తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే వీధి కుక్కల నియంత్రణకు చేపడతామని తెలిపారు.

8న జిల్లాస్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీలు

శ్రీకాకుళం సిటీ: జిల్లా కేంద్రంలోని టౌన్‌హాల్ వేదికగా ఈ నెల 8న జిల్లాస్థాయి ఫెన్సింగ్ సీనియర్ విభాగం పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల పైబడిన వారందరూ ఈ పోటీల్లో పాల్గొన వచ్చునని పేర్కొన్నారు. 18 ఏళ్ల కంటే తక్కువ వయసు కలిగిన వారు గతంలో ఫెన్సింగ్ క్రీడలో పాల్గొన్న అనుభవం కలిగి ఉండాలని, ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఫెన్సింగ్ అసోసి యేషన్ ఆఫ్ ఇండియా రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తెలిపారు. ఆసక్తి ఉన్న, అర్హత గల ఫెన్సింగ్ క్రీడాకారులు మరిన్ని వివరాల కోసం ఎన్ఐఎస్ కోచ్ జోగిపాటి వంశీ 76608 74844 నంబర్‌ను సంప్రదించవచ్చునన్నారు. జిల్లాస్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 11న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ఈనెల 15న ఢిల్లీ వేదికగా జరిగే జాతీయ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు.

చెక్కును అందజేస్తున్న నాయకులు

క్షతగాత్రులకు ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు : కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటనలో గాయపడిన క్షతగాత్రులను ప్రభుత్వ పరంగా ఆర్థికసాయం అందజేశామని తహాశీల్దార్ డి.సీతారామయ్య తెలిపారు. ఈ మేరకు టిడిపి నాయకులతో కలిసి బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా మంజూరైన చెక్‌ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని శివరాంపురానికి చెందిన దట్టి ఆదెమ్మ, సీతాపురానికి దుంప భారతిలకు వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సురాడ మోహనరావు, మాజీ ఎంపిపి గోరకల వసంతరావు, పిఎసిఎస్ చైర్మన్ కణితి సురేష్ చౌదరి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, కోనారి కిరణ్‌కుమార్, అరసవల్లి ఉమామహేశ్వరరావు, శశిభూషణ్, కర్ని రమణ, పోతనపల్లి సాంబమూర్తి, మురిపింటి పాపారావు పాల్గొన్నారు.

92 పైసల వడ్డీకే స్త్రీనిధి రుణాలు

ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- మందస

అర్హత గల మహిళా సంఘాలు వారి ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు 92 పైసలు వడ్డీకే సంఘం కోరిన 48 గంటల్లోనే సరైన డాక్యుమెంటేషన్ ఉంటే రుణం ప్రాసెస్ చేయవచ్చునని వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మందస సచివాలయం, పంచాయతీ కార్యాలయాల వద్ద గురువారం పోస్టర్లను అంటించారు. ఒక సంఘానికి రూ.8 లక్షల వరకు మంజూరు చేయవచ్చునని వివరించారు. దీనికోసం మిగతా కమర్షియల్ బ్యాంకుల వలే పొదుపు ఖాతాలో డబ్బులు, నిల్వలు ఉండనవసరం లేదన్నారు. డాక్యుమెంటేషన్, ఇన్స్పెక్షన్, ప్రాసెసింగ్ ఛార్జీలు వింటి ఫ్రీ సభ్యులు రుణ సురక్ష తప్ప ఏ విధమైన ఛార్జీలు చెల్లించనవసరం లేదన్నారు. పనులు మానుకొని బ్యాంకుల చుట్టూ తిరగనవసరం పనిలేదని తెలిపారు. కేవలం మీ గ్రామ సంఘంలోనే డాక్యుమెంటేషన్ చాలని చెప్పారు. రూ.50 వేలుకు 24 నెలలకు కేవలం 6,377 మాత్రమే వడ్డీ అవుతుందన్నారు. రూ.లక్షకు 36 నెలలకు రూ.19,257 మాత్రమే వడ్డీ అవుతుంది. ఇంతకంటే ఎక్కడైనా ఎక్కువ వసూలు చేస్తే పూర్తి ఆధారాలతో మండల వెలుగు కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. ఎంత అప్పు తీసుకుంటే నెలవారి ఎంత వడ్డీ చెల్లించాలో పూర్తి వివరాలను ప్రభుత్వం, స్త్రీనిధి బ్యాంకు వారు తగు వివరాలతో పోస్టర్లను అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యాలయం, గ్రామ సచివాలయం, ప్రధానంగా ఎక్కువ మంది మనుషులు సంచరించే స్థలాల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు బాలకృష్ణ ముఖలింగం, విఒఎలు గాయత్రి, శోభ పాల్గొన్నారు.

పోస్టర్లు అంటిస్తున్న అధికారులు

నేడు పొందూరు మండల సమావేశం

పొందూరు: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిపి కిల్లి ఉషారాణి తెలిపారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ హాజరుకానున్నారని ఆమె పేర్కొన్నారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి తమ విభాగాలకు సంబంధించి పూర్తి వివరాలతో మండల స్థాయి అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు హాజరుకావాలని ఆమె తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న రాజశేఖర్

ఉద్యాన పంటలపై అవగాహన

కొత్తూరు: మండలంలోని అడ్డంగిలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యాన సైంటిస్టు రాజశేఖర్ ఉద్యానవన పంటలపై గిరిజన రైతులకు గురువారం అవగాహన కల్పించారు. జీడి, పసుపు పంటలపై వచ్చే తెగుళ్లు, పురుగులు నివారణ యాజమాన్య పద్ధతులపై పలు సూచనలు చేశారు. ఆర్ఒఎఫ్ఆర్ పట్టా ఉన్న ఆదివాసీ రైతులు పసుపు బాయిలింగ్, పసుపు పాలిష్, సోలార్ డ్రైయర్, స్ప్రేయర్స్ 90 శాతం రాయితీ పొందవచ్చునన్నారు కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్స్ మంగమ్మ, హెచ్ఇఒ షర్మిల, వెలుగు అసోసియేషన్ డైరెక్టర్ బి.సంజీవరావు, కార్యదర్శి కృష్ణారావు, విఎఎ దివాకర్ పాల్గొన్నారు.

విజేతలకు జ్ఞాపికలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జాతీయ న్యాయ సేవలు దినోత్సవం పురస్కరించుకొని స్థానిక జ్ఞాన భారతి విద్యా సంస్థలో ఇటీవల వ్యాసరచన పోటీలు నిర్వహించామని సంస్థ కార్యదర్శి జోహార్‌ఖాన్ తెలిపారు. ఈ పోటీలో వైష్ణవి, అక్బర్‌ఖాన్, సేనాపతి సోనియా, గ్రీస్మత్ చౌదరి విజేతలుగా నిలిచారన్నారు. విజేతలకు మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి పరేష్ కుమార్ మోడల్స్‌ను గురువారం అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రిన్సిపాల్ ఐ.బి. పండా తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎన్‌హెచ్‌ఆర్‌సి అండ

ఎపిటిపిసి చైర్మన్ బాబూరావు

మాట్లాడుతున్న బాబూరావు

ప్రజాశక్తి- పలాస

మానవ హక్కులకు భంగం వాటిల్లితే జాతీయ మానవ హక్కుల సంఘం అండగా ఉంటుందని ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. కాశీబుగ్గ నిత్యానందనగర్‌లో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) జిల్లా అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాన్ని ఎన్‌హెచ్‌ఆర్‌సి నేషనల్ చైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ బి.రాంబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ మానవ హక్కులకు ఎక్కడైనా భంగం, అన్యాయం జరిగిన వారిపై నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అండగా ఉంటుందన్నారు. సమాజ సేవ కోసం హ్యూమన్ రైట్స్ కార్యాలయం ప్రారంభించామన్నారు. జిల్లా చైర్మన్ డాక్టర్ చిన్నవాడు మాట్లాడుతూ గత కొంతకాలంగా ఎన్‌హెచ్‌ఆర్‌సి ప్రజలకు ఎంతో చేరువుగా సేవా కార్యక్రమాలు చేసిందన్నారు. కార్యక్రమానికి ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, దువ్వాడ శ్రీకాంత్, లోడగల కామేష్ యాదవ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి విజేతలు వీరే

ప్రజాశక్తి- నరసన్నపేట

రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు వివిధ స్థాయిల్లో ఇటీవల పోటీలు నిర్వహించామని, ఈ పోటీలో ఐదు కళాశాలల నుంచి ముగ్గురేసి చొప్పున ఎంపిక 15 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పవన్ మరపట్ల గురువారం తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి ఆరుగురిని ఎంపిక చేసి వారికి మళ్లీ భారత స్వాతంత్ర్య పోరాటంపై క్విజ్ పెట్టామన్నారు. అందులో ముగ్గురు విజేతలను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. గదిలి మధుమిత, బాన్న రేణుక (జిజె కాలేజీ, నరసన్నపేట), పాండ్రంకి చాందిని (జిజె కాలేజీ, పోలాకి)లను జిల్లా స్థాయిలో నిర్వహించనున్న పోటీలకు ఎంపిక చేశామన్నారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో శుక్రవారం ఉదయం నిర్వహించనున్న పోటీల్లో విజేతలు పాల్గొనాలని సూచించారు. న్యాయ నిర్ణేతలుగా ఎస్.సత్యనారాయణ, సిహెచ్.విశ్వప్రసాద్, డాక్టర్ హెచ్.మల్లేశ, ఆర్.సోమశేఖర్ వ్యవహరించారు.


ఎంపికైన విద్యార్థులు

జనసేనకి ఆహ్వానిస్తున్న రవికుమార్

జనసేనలోకి వైసిపి సర్పంచ్

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని వసుంధర పంచాయతీ వైసిపి సర్పంచ్ సలాన అప్పలనాయుడు తన అనుచరులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. బుధవారం రాత్రి జనసేన నాయకులు, సుడా చైర్మన్ కోరికన రవికుమార్ ఆధ్వర్యాన ఆయన పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి కోసం, పారదర్శక పాలన కోసం జనసేనలో చేరినట్లు తెలిపారు. పార్టీ నాయకులు ఆయన చేరికను స్వాగతిస్తూ, జనసేన బలాన్ని గ్రామస్థాయిలో మరింత విస్తరించేందుకు దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు కోరికాన భవాని, మండల జనసేన నాయకులు దుక్క బాలరాజు, ఎఎంసి డైరెక్టర్ చింతల ప్రశాంత్, లక్ష్మీపురం కిరణ్ కుమార్, పిట్ట హరి, డోల క్రాంతి కుమార్, సోలాపురం చంటి, రామ్మూర్తి పాల్గొన్నారు.

పొందూరు కెజిబివి ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

పొందూరు కెజిబివి ప్రిన్సిపాల్ లలిత కుమారిపై ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థిని వందన శక్తి యాప్‌లో ఫిర్యాదు చేసింది. రెండు నెలల కిందట పొందూరు కెజిబివి భవనంపై నుంచి దూకి వందన ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తీవ్ర గాయాలపాలై శ్రీకాకుళం జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆమె గురువారం శక్తి యాప్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు విద్యార్థిని సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేసింది. తనపై, తన తల్లిపై తప్పుగా మాట్లాడడం వల్లే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డానని, అధికారుల బెదిరింపు వల్ల అప్పట్లో వాస్తవాలు చెప్పలేకపోయానన్నారు. కాగా ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదుకు సంబంధించి తమకు సమాచారం లేదని పొందూరు పోలీసులు తెలిపారు.

పరిశీలిస్తున్న జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ

తేలుకుంచి సందర్శన

ఇచ్ఛాపురం : విదేశ వలస పక్షులు విడిది చేస్తున్న తేలుకుంచిలో జెడ్‌పి సిఇఒ డి.సత్యనారాయణ గురువారం సందర్శించారు. ఏటా క్రమం తప్పకుండా గ్రామానికి వస్తున్న విదేశ వలస పక్షులు విడిది కేంద్రాన్ని చూశారు. వాచ్ టవర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు మెరుగు సూర్యనారాయణ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందిస్తే ప్రభుత్వానికి పంపిస్తానని జెడ్‌పి సిఇఒ తెలిపారు. అనంతరం గ్రామంలోని చెట్లు, చెరువులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపిడిఒ ప్రభాకరరావు, ఎఒ రామారావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అభినందిస్తున్న మూర్తి

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్‌కు ఐదుగురు ఎంపిక

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విశాఖపట్నంలో ఈ నెల 9,10 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్-19 స్విమ్మింగ్ పోటీలకు ఐదుగురు ఎంపికయ్యారని క్లబ్ అధ్యక్షులు ఎల్.ఎన్.మూర్తి తెలిపారు. ఎం.ధనలక్ష్మి, జి.శైలజ, ఎస్.కార్తీక్, జి.బలరాం, తేజాలు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు క్రీడాకారులను గురువారం అభినందించారు. వ్యాపారవేత్త బత్తుల వెంకటరమణ సహకారం అందిస్తున్నట్టు తెలిపారు. బంగారు పతకాలు సాధించి తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పిఇటి భారతి, మదీనా, స్విమ్మింగ్ కోచ్ బత్తుల రామారావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు డొంకూరు విద్యార్థులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఎంపికైన విద్యార్థినులు

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డొంకూరు బాలికలు ఎంపికైనట్టు హెచ్ఎం జి.హేమకుమారి తెలిపారు. ఈ మేరకు గురువారం వారిని అభినందించారు. శ్రీకాకుళం ఇండోర్ స్టేడియంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఎంపికలో జె.అను. హేమలత ఉన్నత ప్రతిభ కనబర్చారన్నారు. ఈ నెల 7 నుంచి 9 వరకుకడప జిల్లా బాద్వాల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు నుంచి ఆతిథ్యం వహిస్తారని తెలిపారు. వీరు ఎంపికపై స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ జె.జానకిరావు, ఉపాధ్యాయులు వెంకటరావు, గోవిందరావు, శ్రీహరి, శంకర్‌రెడ్డి, నూక్కయ్య పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన రాజశేఖర్

ప్రజాశక్తి- రణస్థలం

జగన్మోహన్ రెడ్డిని కలిసిన రాజశేఖర్

తాడేపల్లి వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం మాజీ సిఎం, వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన వైసిపి రాష్ట్రస్థాయి విద్యార్థి విభాగం కార్యవర్గ సమావేశానికి ఎచ్చెర్ల నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు ముద్దాడ రాజశేఖర్ హాజరై మాజీ సిఎంను మర్యాదపూర్వకంగా కలినట్టు తెలిపారు. ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్ల కిరణ్ కుమార్ బాగున్నారా అని అడిగి, ఎచ్చెర్ల నియోజకవర్గ పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారని తెలిపారు. గొర్లె కిరణ్ కుమార్‌తో కలిసి పార్టీ పూర్వవైభవానికి కృషి చేయాలని, పార్టీ కోసం కష్టపడిన వారికి ఎప్పటికీ పార్టీలో గుర్తింపు ఉంటుందని తెలియజేసినట్లు పేర్కొన్నారు.

రాము మృతదేహం

విద్యుత్ స్తంభం పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలంలోని రెల్లివలసలో విద్యుత్ స్తంభాలు మారుస్తుండగా ప్రమాదం సంభవించింది సంఘటన స్థలంలో బాన రాము (48) అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు నడగాము గ్రామానికి చెందిన బాణాల రాము, జోగి రాంబాబు విద్యుత్ స్తంభాలు వేయడానికి పనులు నిమిత్తం రెల్లివలస గ్రామానికి వెళ్లారు. ట్రాక్టర్‌పై విద్యుత్ స్తంభాలు ఎక్కిస్తుండగా వారిపై పడిపోయాయి. దీంతో రాము మృతి చెందగా జోగి రాంబాబుకు కుడి కాలు, చేయి విరిగి పోయాయి. వెంటనే స్థానికులు స్పందించి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

నృత్యం చేస్తున్న చిన్నారులు

కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని ఇచ్ఛాపురం గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారు. చిన్నారులు బుధవారం రాత్రి చేసిన కూచిపూడి భరతనాట్యం అందరినీ అలరించాయి. నాట్య గురువు బలివాడ శృతి పట్నాయక్ అకాడమీ అధ్యక్షులు చిన్నా గురుస్వామి, జయలక్ష్మి దంపతుల ఆధ్వర్యాన 30 మంది చిన్నారులు నాట్యంలో పాల్గొన్నారు. పాటలకు చక్కని హావభావాలతో నృత్యాన్ని అందించారు. కార్యక్రమంలో వేద పండితులు, ఆలయ కమిటీ సభ్యులు చిన్నారులను సత్కరించారు.

బాధితులకు దుస్తులు, నగదు అందజేస్తున్న రాజు

దుస్తుల పంపిణీ

లావేరు : మండలంలోని బుడుమూరు అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు గురువారం పాతపట్నం సబ్ రిజిస్ట్రార్ గురుగుబిల్లి రాజు పరామర్శించారు. అనంతరం బాధితులకు దుస్తులు, నగదు అందజేశారు. ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు మనవతా దృక్పదంతో సహాయం చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ పండి గోపాలరావు, మాజీ ఎంపిటిసి ఆరంగి సత్తిరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీమస్త్రం తయారీపై అవగాహన

కవిటి: మండలంలోని గొర్లపాడు యూనిట్ ఖాజురులో బిఆర్‌సి బయో ఇన్‌పుట్స్ సెంటర్ వద్ద రైతులకు నీమస్త్రం తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రసం పీల్చే పురుగుల నివారణకు ఉపయోగించే ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఎంఎంటి నరసింహ, డిఎంఎంటి తులాశయ్య వివరించారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పి స్వాతి, సంతోషి, గున్నమ్మ, రైతులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

నందిగాం : మండలంలోని మదనాపురం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని టెక్కలి విద్యుత్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 33 కెవి 33 కెవి విద్యుత్ లైన్ల నిర్వహణ, చెట్టుకొమ్మల తొలగింపు ఉంటుందన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దీనబంధుపురం, తమలాపురం, బినియపూరు, దిమ్మిడిజాల, ఎస్.కరజాడ, కల్లాడ, మదనాపురం టౌన్ ఫీడర్ పరిధిలో హర్షబడ, శారదపురం, వెంకటాపురం, ఇండస్ట్రీస్ ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి మొగిలిపాడు 11 కెవి ఫీడర్, సూదికొండ 11కెవి ఫీడర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు పలాస డివిజన్ విద్యుత్‌శాఖ అధికారి జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సూదికొండ, ఇందిరాగాంధీ బొమ్మ నుంచి హరిశంకర్ సినిమా హాల్ వరకు, సాయి కాలనీ, రోటరీ నగర్, లేబర్ కాలనీ, వివేకానంద కాలనీ, ప్రభుత్వ ఐటిఐ రోడ్డు ప్రాంతం, సాహిబ్ కాలనీ, మదర్ థెరిసా స్కూల్, పురుషోత్తపురం ప్రాంతాలు, రెడ్డిక వీధి, బత్తులవీధి, పెద్ద వీధి, ఉల్లాసపేట, ఉదయపురం, శ్రీనివాసనగర్, బద్దిపోలమ్మ, ఎల్లమ్మతల్లి ఆలయాల ఏరియాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.


రక్తదానం చేస్తున్న సిబ్బంది

25 మంది రక్తదానం

ప్రజాశక్తి- పలాస

చైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినోత్సవం సందర్భంగా గురువారం మెగా రక్తదాన శిబిరం ప్రిన్సిపాల్ వై.రామకృష్ణ ఆధ్వర్యాన నిర్వహించారు. పలాస చైతన్య స్కూల్, కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు 25 మంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. చైతన్య పాఠశాలల ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎజిఎం ఎం.వి.సురేష్, శ్రీకాకుళం రీజనల్ ఇన్‌చార్జి ఎస్.రామినాయుడు, అకడమిక్ కో-ఆర్డినేటర్ ఎ.బాలరాజు, కళాశాల ప్రిన్సిపాల్ బి.యాదవరావులు రక్తదానం చేసిన తమ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ ఎస్.జోగారావు, సి- బ్యాచ్ అండ్ ఐకాన్ ఇన్‌ఛార్జి కె.షణ్ముఖరావు, మిడ్ స్కూల్ ఇన్చార్జ్ యుధిష్టర్ రెడ్డి, ప్రైమరీ ఇన్‌ఛార్జి నీలవేణి, ఎఒ జయబాబు పాల్గొన్నారు.

పయనమవుతున్న జట్టు

జిల్లా టెన్నికాయిట్ జట్టు పయనం

పలాస : ఈనెల7, 8 ,9, తేదీల్లో బాపట్ల జిల్లా చీరాలలో నిర్వహించానున్న 42వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల-18 బాల బాలికల టెన్నికాయిట్ పోటీలకు శ్రీకాకుళం జిల్లా జట్టు సిద్ధమైంది. ఈ సందర్భంగా క్రీడాకారులకు క్రీడా దుస్తులను బొమ్మాళి రోహిణి గురువారం వితరణ చేశారు. కార్యక్రమంలో జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లా సంతోష్‌కుమార్, సుడియా వెంకట జోగారావు, రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.తవిటయ్య, మొదటి జోన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి పి.గజేంద్రరావు పాల్గొన్నారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్లుగా బి.తిరుమలరావు, బి.మహేష్, లండ దిలీప్ వ్యవహరిస్తారని పి.తవిటయ్య తెలిపారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి- సోంపేట

విద్యార్థి దశలో యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, లేదంటే జీవితం తమంతట తామే నాశనం చేసుకున్నవారవుతారని బారువ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్.హరిబాబు నాయుడు విద్యార్థులకు హితబోధ చేశారు. మండలంలోని కొర్లాం బాలకృష్ణ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. విద్యార్థులు చదువుతున్న సమయంలో ఆకర్షణలకు దూరంగా ఉండాలన్నారు. ప్రేమకాని, ప్రేమను నమ్మి మోసపోవద్దని, అంతర్జాల మాయలో పడి అప్పులు చేసి జీవితం తిప్పలు పాలు చేయొద్దని, లేని యడల చట్టాల చిక్కులో పడి జీవితం పాడు చేసుకోవద్దని హెచ్చరించారు. పోక్సో తదితర చట్టాలపై అవగాహన కల్పిస్తూ చక్కగా చదువుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాంబుడ్డి గణపతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ హరిబాబు నాయుడు

పిపిపికి వ్యతిరేకంగా రచ్చబండ

కోటబొమ్మాళి: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ వ్యతిరేకంగా సంతకాలను సేకరిస్తున్నామని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని మాసాహెబ్‌పేట, తాటిపర్తి, నీలంపేట పంచాయతీలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయడాన్ని నిరసిస్తూ గురువారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సంతకాలను సేకరణ చేపట్టారు. అనంతరం టిడిపి నుంచి ఐదు కుటుంబాలు శంశకరరావు, పులి సింహాచలం, జోగి ప్రశాంత్, శివ, రామారావు వైసిపిలో చేరారు. కార్యక్రమంలో వైసిపి అధ్యక్షులు అధ్యక్షులు హేమసుందర్ రాజు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు రామారావు, జెడ్‌పిటిసి వెంకటరావు పాల్గొన్నారు.

వైసిపిలోకి ఆహ్వానిస్తున్న తిలక్

అవగాహన కల్పిస్తున్న కరుణాకరరావు

పశువులకు టీకాలు

మెళియాపుట్టి: సెక్స్ సార్టెడ్ సేమన్‌పై ప్రతిఒక్క పశు పోషకుడూ అవగాహన కలిగి ఉండాలని పాతపట్నం పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకు డాక్టర్ మంచు కరుణాకరరావు అన్నారు. మండలంలోని గాతలవలసలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెక్స్ సార్టెడ్ సేమన్‌ను సబ్సిడీపై రూ.150కే రైతులకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. గర్భకోశ వ్యాధులకు పరీక్షలు చేయించుకొని, అటువంటి పశువులన్నీ చూడు కట్టేటట్లు చేసుకోవాలన్నారు. తద్వారా ఆర్థికంగా ఎంతో లాభం కలుగుతుందని చెప్పారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత పశుగ్రాస పెంపక పథకాన్ని, మినీ గోకులం పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. 50 శాతం రాయితీపై అందజేస్తున్న పశుదానాను వినియోగించుకోవాలన్నారు. ముందుగా ఈ శిబిరాన్ని సర్పంచ్ బమ్మిడి భాస్కరరావు ప్రారంభించారు. వైస్ ప్రెసిడెంట్ పల్లి కర్రన్న, టిడిపి నాయకులు హనుమంతు శేఖర్ పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌లను పరిదిలిస్తున్న అధికారులు

భూగర్భ జలాల పెంపునకు చర్యలు

కోటబొమ్మాళి : జిల్లాలో భూగర్భ జలాలు పెంపునను చెక్‌డ్యామ్ నిర్మాణం ఎంతో అవసరమని ఎజిపిడి రమేష్, జియాలజిస్టు అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొత్తపల్లి, కోటబొమ్మాళిలోని చెరువులను, వాగులను గురువారం పరిశీలించారు. అలాగే చెక్ డ్యామ్‌లు, చెక్‌వాల్స్ నిర్మాణాలకు అనువైన ప్రదేశాలనూ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూగర్భ జలాలను 3 నుంచి 8 మీటర్లకు పెరిగే విధంగా రీఛార్జ్ స్ట్రక్చర్స్ గుర్తించి చెక్ డాం నిర్మాణాలను చేపట్టేందుకు అనువైన ప్రదేశాలను గురిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డి.లోకేష్, ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ జి.హరిప్రసాద్, టి.రాంబాబు, దామోదర్ పాల్గొన్నారు.

కలశ యాత్రలో పాల్గొన్న మహిళలు

ఘనంగా కలశ యాత్ర

కవిటి : సాయంత్రపు సూర్యరశ్ములు బంగారు వర్ణంలో తేలుతుండగా... పసుపు వర్ణపు చీరలతో, తలపై కలశాలతో నడిచిన మహిళల అడుగులు, మంగళ వాయిద్యాల నినాదాలు కవిటి గ్రామంలో మార్మోగాయి. కవిటి నుంచి బయలుదేరిన కలశ యాత్ర ఈదుపురం బహుదా తీరాన ఆగి కలశంలో పవిత్ర జలంతో తిరిగి కవిటి పొలిమేరలోని కాళీమాత ఆలయానికి చేరింది. శుక్రవారం జరగనున్న విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు పూర్వసంధ్యగా గురువారం నిర్వహించిన ఈ జలాభిషేకం గ్రామాన్ని భక్తి తరంగాల తీరంలో ముంచెత్తింది. కాళీమాత సన్నిధిలో జలకలశాల తేజస్సు ప్రతిఫలించగా వాతావరణమంతా పసుపు వర్ణపు పవిత్రతతో పరిమళించింది.